క్లుప్తంగా

మల్లు రవి ఎంపికపై హర్షం

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ డా మల్లురవికి కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేయడంపై కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి తోటపల్లి రాజేష్‌రెడ్డి, ఎల్లికల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, తిమ్మరాస్‌పల్లి కౌన్సిలర్ రవీందర్, నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

అగ్నివీర్‌పై అవగాహన

కల్వకుర్తి: అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని కల్వకుర్తి మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.శార్వాణీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కళాశాలలో అగ్నివీర్‌పై వింగ్ కమాండర్ గురుప్రీతి అత్వాల్ అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు దేశరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కార్పోరల్ సందీప్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పాండు, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



తాడూరు: మండల కేంద్రంలో సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. వాహనాలలో డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

బ్రాహ్మణ భవన నిర్మాణానికి భూమి పూజ



కల్వకుర్తిరూరల్: పట్టణ పరిధిలోని కైలాసం గుట్టపై వేదగాయిత్రి బ్రాహ్మణ అర్చక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బ్రాహ్మణ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దత్తాత్రేశర్మ, శరత్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌శర్మ, కోశాధికారి వంశీకృష్ణ, చంద్రశేఖర్, వేణుగోపాల్‌రావు, గోపాలచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారా నిర్మాణానికి..



వెల్దండ: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయ ముఖద్వారా నిర్మాణానికి శుక్రవారం మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన దాతలు సిల్వేర్ రామస్వామిగౌడ్‌అలివేలు, వెంకటేష్‌పూజశ్రీలు భూమిపూజ చేశారు. రూ.20 లక్షల వెచ్చించి ముఖద్వారా నిర్మాణం చేపడుతునట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, శేఖర్, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మట్ట విష్ణుగౌడ్, నాగేశ్వర్‌గౌడ్, ఆలయ అర్చకులు, నాయకులు తదితరులు ఉన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

తాడూరు: మండలంలోని తుమ్మలసూర్ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్ ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హెచ్‌ఎంను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉపాధ్యాయులు రాజేంద్ర, ప్రమోద్‌కుమార్‌లు కొనియాడారు.

వార్డెన్ మృతికి సంతాపం

మన్ననూర్: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతి గృహం వార్డెన్ శుక్రవారం మృతిచెందింది. అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామం ఉమామహేశ్వర కాలనీకి చెందిన గీత(41) వార్డెన్‌గా విధులు నిర్వహిస్తోంది. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న డీటీడీఓ కమలాకర్ రెడ్డితో పాటు వార్డెన్లు, వర్కర్లు, గ్రామస్తులు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలు భర్త ఐటీడీఏ టీచర్ నాసరయ్య గతంలోనే మృతి చెందాడు. వారికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకముందే కార్పొరేట్ కళాశాలలో యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వచ్చే విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు తీసుకుంటున్నారని బీఎస్‌ఎఫ్ జిల్లా విద్యార్థి సంఘం నాయకుడు కే రామకృష్ణ ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల్లో ఒంటిపూట



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

అచ్చంపేట: ఎండలు తీవ్రత అధికం కావడంతో ప్రభుత్వ పాఠశాలల మాదిరి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఒక్కపూట ప్రకటించింది. కేంద్రాల పనివేళలను మార్పు చేసింది. రానున్న రెండు నెలల పాటు వేసవి వేడి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం12.30గంటల వరకే కేంద్రాలు తెరిచి ఉంచాలని మహిళా, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలకు ఈనెల15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కాగా, అంగన్‌వాడీలకు ఈ నెల16 నుంచి ఒంటిపూట నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వేసవిలో వడగాల్పులతో చిన్నారులు అవస్థలు పడే అవకాశం ఉండటంతో మే 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించనున్నారు. ఎండకాలం ప్రారంభం కావడంతో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేక ఇరుకైన గదుల్లో ఉక్కపోతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉండేవి. ప్రస్తుతం ఒంటిపూట కేంద్రాలు నిర్వహించనున్న నేపథ్యంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఉదయం 11 గంటల నుంచి 11.30గంటల వరకు మధ్యాహ్న భోజనం వడ్డించే విధంగా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చిన్నారులు ఇళ్లకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. టీచర్లు, ఆయాలు వార్షిక సర్వే, ప్రీస్కూలు ప్రవేశాలకు విద్యార్థుల నమోదు, బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 1,131 అంగన్‌వాడీ కేంద్రాల్లో 30,302 మంది చిన్నారులు, 10,277 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

చిన్నారులకు ఊరట

వేసవి ప్రారంభంలో ఏటా పాఠశాలలకు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తుంటారు. అలాగే విద్యాసంవత్సరం పూర్తి కాగానే వేసవి సెలవులు సైతం ఉంటాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం వేసవి సెలవులు ఉండవు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు ,ఆయాలకే కాకుండా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో ఒంటిపూట కేంద్రాల నిర్వహణ చిన్నారులకు ఉపశమనంగా మారనుంది. అలాగే ఎండల తీవ్రతకు అనుగుణంగా మే నెలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు 15రోజుల చొప్పున సెలవులు ప్రకటించనున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ప్రభుత్వ అదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట నిర్వహిస్తున్నాం. నిర్దేశించిన ప్రకారం కేంద్రాలు తెరచి ఉంచాలని ఇప్పటికే టీచర్లకు ఆదేశాలు ఇచ్చాం. సమయ పాలన పాటించి, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని సూచించాం.

–లక్ష్మి, సీడీపీఓ బల్మూర్

నీటిని వృథా చేయొద్దు



కల్వకుర్తిలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం

కల్వకుర్తి టౌన్: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని కల్వకుర్తి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీలో సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వర్షపు నీటిని ఒడిసిపట్టాలని కోరారు. ఆస్పత్రిలో రోగులు కుళాయిల వద్ద నీటిని వృథా చేయొద్దన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు స్వర్ణలత, నర్సులు, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వాటర్‌మెన్లపై నీటి వినియోగంగాపై అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న పాలమూరు పీజీ సెంటర్‌లో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ జలదినోత్సం నిర్వహించారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని హెచ్‌ఎం సామ్య నాయక్ కోరారు. నీరు ప్రాణాధారం– నీటిని కాపాడుకుందాం అనే నినదించి ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు శ్రీశైలం, శంకరయ్య, జయమ్మ, వైడూర్య, స్వాతి, పాల్గొన్నారు.

లింగాల: అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో బూత్ స్థాయి గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించారు. లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు, ఎఫ్‌ఏలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్(బీకే), మాధవానిపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీఓఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



మాట్లాడుతున్న కార్యదర్శి సరిత

మన్ననూర్: ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని పంచాయతీ కార్యదర్శి సరిత అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్‌లో కార్యదర్శి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఏర్పాటులో ఓటర్లు భాగస్వాములవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటయ్య, సైదులు, కృష్ణయ్య మహిళలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: ఓటు హక్కు నమోదుపై గ్రామ పంచాయతీలో అధికారులు బీఎల్‌ఓ, మహిళా సంఘం సీసీల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జావెద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



లింగాల మండలం సూరాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు



మామిళ్లపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు

పెంట్లవెల్లి: మండలంలోని మాధవస్వామినగర్, మంచాలకట్ట గ్రామాల్లో ప్రకృతి వనాలను, నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ ప్రసన్నకుమారి పరిశీలించారు. మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీ అశ్వినికి సూచించారు. జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

చారకొండ: మండలంలోని రామచంద్రాపురంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ పర్యటించారు. అభివృద్ధి పనులపై వివరాలను సేకరించి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గ్రామంలో నర్సరీలను, కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ఉన్నారు.

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న పనుల ప్రదేశాల వద్ద కూలీలకు తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు పంచాయతీ కార్యదర్శికి సూచించారు. శుక్రవారం మండలంలోని మామిళ్లపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం దాసర్లపల్లి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు పవన్, ప్రదీప్‌రెడ్డి, ఈజీఎస్ టీఏలు ఉమాపతి, మల్లేష్ పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని మేడిపూరు, గుట్టలపల్లి గ్రామాలలోని వననర్సరీలు, ఉపాధి పనులు, పాఠశాలలో మధ్యాహ్న భోజన వసతులను ఎంపీడీఓ జ్యోతిపరోసియా పరిశీలించారు.

పెద్దకొత్తపల్లి: మండలంలో 25 గ్రామపంచాయితీలలో 1560 మంది కూలీలు పనులు చేస్తునట్లు ఏపీఓ మంజుల పేర్కొన్నారు.

అమ్రాబాద్: కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ మోహన్‌లాల్ సూచించారు. మండలంలోని ఎమిరెడ్డిపల్లి, మాధవానిపల్లి గ్రామాల్లో వన నర్సరీలను సందర్శించి ఉపాధీహామీ పనులు పరిశీలించారు.

లింగాల: మండల పరిధిలోని సూరాపూర్ గ్రామ శివారులో అమలవుతున్న పనులను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాం అలీ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే ఓబీసీలకు సముచిత న్యాయం

బల్మూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే ఓబీసీలకు సరైన న్యాయం చేకూరుతుందని ఓబీసీ మోర్చా రాష్ట ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని కొండనాగులలో నిర్వహించిన ఓబీసీ సామాజిక సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర కేబినెట్‌లో 27 మంది బీసీలకు మంత్రులను చేసిన ఘనత ప్రధానికే దక్కుతుందన్నారు. విశ్వకర్మ యోజన పథకం కింద 18 కులవృత్తులకు చేయూతనిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఓబీసీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దయ్య, నాయకులు శ్రీనివాస్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



వెల్దండ: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరానికి పెట్టుబడి సాయం రూ.15 వేలు, రూ.2 లక్షల పంట రణాలను మాఫీ ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.2500, వృద్ధాప్య పింఛన్ రూ. 4వేల ఇస్తామన్న హామీ ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూధన్‌రెడ్డి, నర్సింహ్మ ముదిరాజ్, రమేష్‌ముదిరాజ్, వెంకటయ్య, రమేష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన యువకుడు అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదైందని ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం ఆలూరి శ్రీకృష్ణ అలియాస్ చంటి(21) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20వ తేదీన పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో యువకుడి తండ్రి ఆలూరి గెల్వయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి బ్రహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి వడిబియ్యంతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శతకలశం, మహాపూర్ణహుతి నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలువురిని సన్మానించారు. భక్తులకు జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కోడేరులో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి



మన్ననూరులో..

కోడేరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారంపై గర్భిణులకు బాలింతలకు పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాజా ఆకు కూరలు, పాలు, గుడ్లు తరుచుగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మి, స్వాతి, పద్మ, డి లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక 4వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణపక్షం వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐటీడీఏ మేనేజర్ జాఫర్ ఉసేన్, వైద్యాధికారి సుధాకర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్న పోషకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ శాంతమ్మ మాట్లాడుతూ గర్భిణులు బాలింతలు రక్తహీనత బారిన పడకుండ ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి, సూపర్‌వైజర్ పద్మావతి, హబ్బు వెంకటమ్మ మన్ననూర్ క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు మాసమ్మ, యశోద, రాణి, మంజుల, బాలకిష్టమ్మ, ఆయాలు సరిత, పార్వతమ్మ, లక్ష్మమ్మ, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కొల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు భారతి, సుగణను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పీడీ కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందరజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిర్వహణ సక్రమంగా లేదని అంగన్‌వాడీ టీచర్లను తొలగించడం సరికాదన్నారు. ఎలాంటి విచారణ లేకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు, అశోక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్‌బాటిల్స్ పంపిణీ



వాటర్ బాటిల్స్ అందజేస్తున్న క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు తర్నికల్, సుద్దకల్ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో 300మంది విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను శుక్రవారం అందజేశారు. క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ కుమారుడు సాయితేజ పుట్టినరోజు సందర్భంగా వాటర్‌బాటిల్స్‌ను పంపిణీ చేసినట్లు ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్, శ్రీనివాస్, జూలూరి సత్యం, అశోక్, ఎం అశోక్, రాజేందర్, రఘురాం, లక్ష్మీ, హెచ్‌ఎం నిర్మల, విజయ, బాలమణి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని మహాదేవ్‌పూర్ స్టేజీ వద్ద ఈనెల 18న కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో తెల్కపల్లి మండలం రాకొండకు చెందిన కొకుంట్ల కృష్ణయ్యగౌడ్ గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై శుక్రవారం బాధితుడి కుమారుడు రాజుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు లారీ డ్రైవర్ రాఘవయ్యపై కేసు నమోదు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

వ్యక్తిపై దాడి ఘటనలో..

మండలంలోని గట్టుతుమ్మెన్‌లో ఓ వ్యక్తిపై భార్యభర్తలు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నమ్మ బ్యాంకులో రుణం తీసుకొని సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో బ్యాంక్ అధికారులు గ్రామానికి చేరుకొని చిన్నమ్మ ఇల్లు చూపించాలని తిమ్మయ్యను అడిగాగా ఆమె ఇంటికి తీసుకెళ్లాడు. దీంతో అధికారులు వెళ్లిన తర్వాత చిన్నమ్మతోపాటు ఆమె భర్తతో కలిసి తిమ్మయ్యపై కర్రతో దాడి చేయగా గాయపడ్డాడు. ఈ ఘనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ల పట్టివేత



తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మహేష్, గోవిందుశివ, సాయికుమార్‌లు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గౌరారం గేటు వద్ద పోలీసులు తనిఖీలో ట్రాక్టర్లు పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా మంతటి గ్రామానికి చెందిన జాజాల లక్ష్మయ్య, వడ్డెమాన్ మహేష్‌లు ఇసుక తరలిస్తుండగా గుర్తించినట్లు పేర్కొన్నారు. మొత్తం ఐదు టాక్టర్లను స్వాదీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి టౌన్: ఆస్తిపన్ను పెనాల్టీపై ఉన్న బకాయిలపై 90 శాతం రాయితీని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అంకితభావంతో వైద్య సేవలు అందించాలి

వీపనగండ్ల: ఇటీవల ఉద్యోగంలో చేరిన వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని కమ్యూనిటీ హెల్త్ సూపరింటెండెంట్ డా.రాజుకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఇటీవల ఉద్యోగాలలో చేరిన స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 30 పడకల ఆస్పత్రికి పరికరాలు సమకూర్చాలని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



కల్వకుర్తిరూరల్: పార్లమెంట్ ఎన్నికలను దృష్ట్యా ఆయా గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు శుక్రవారం మండల పరిషత్ అధికారి దేవేందర్ మండలంలోని రఘుపతిపేటలో పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అనువైన పరిస్థితులు, వసతులను పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.